ప్రజాశక్తి
శుక్రవారం 06 సెప్టెంబర్ 2024

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్

పనులకు బ్రేక్..!

- ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులు ఆపేయాలని ఉత్తర్వులు
- పిపిపి విధానంలో పనులు చేపట్టేలా ప్రభుత్వం యోచన

మెడికల్ కళాశాల భవన నిర్మాణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయదలచిన వైద్య కళాశాలల్లో ఆదోని వైద్య కళాశాల ఒకటి. కళాశాల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం తగరతూ నిర్మాణ అనుమతులను ప్రైవేట్ పరం చేయడానికి ప్రతిపాదించింది. ఇలా ఉండగానే కళాశాల నిర్మాణ పనులు ఆపివేయాలని ఎపిఎంఎస్ఐడిసి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిర్మాణ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడనుంది. దీనిపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్య సేవలు కావాలన్నా కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే బళ్లారి, రాయచూర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆదోని పట్టణంలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఆలూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉంటుంది. మెరుగైన సేవలు పొందటానికి వీలుగా ఉంటుంది. 2021 మే 31న రాష్ట్ర వ్యాప్తంగా 14 వైద్య కళాశాలలు వర్చువల్ విధానంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదోని శివారులో ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో ఆరేకల్ వద్ద వైద్య కళాశాల పనులకు శ్రీకారం చుట్టారు. 58 ఎకరాల విస్తీర్ణంలో వంద మెడికల్ సీట్లు, 450 పడకల సామర్థ్యంతో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ప్రకటించారు. 2023 చివరి నాటికి మెడికల్ కళాశాల అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. మూడేళ్ళు గడిచినా ఇప్పటి వరకూ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. వైద్య కళాశాలకు సంబంధించి ఒక బ్లాకు మూడు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. మరో బ్లాకు రెండు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. బాలికల హాస్టల్ ఆరు ఫ్లోర్లు, బాలుర హాస్టల్ రెండు ఫ్లోర్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కిచెన్ పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అత్యవసర విభాగం, ఐఎస్ఎస్ 1, 2 పనులు కూడా ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆదోని వైద్యశాల నిర్మాణ పనులను ఆపేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎపిఎంఎస్ఐడిసి చీఫ్ ఇంజనీర్ గత నెల 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ఆధారంగా తక్షణమే పనులు ఆపేయాలని ఎపిఎంఎస్ఐడిసి కర్నూలు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఇ) ఈ నెల 3న సదరు కాంట్రాక్టరుకు ఆదేశాలు జారీ చేశారు. ఆదోని వాసుల కలగా ఉన్న వైద్య కళాశాల నిర్మాణ పనులు ఆపేయాలని ఉత్తర్వులు ఇవ్వడంపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఆదోని వైద్య కళాశాల పనులు చేపట్టాలని టిడిపి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. "ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులను తాత్కాలికంగా మాత్రమే ఆపేయాలని ఉత్తర్వులు ఇచ్చాం. పిపిపి విధానంలో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దానిపై ఇంకా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వుల ఆధారంగా నిర్మాణ పనులు కొనసాగుతాయి." అని ఎపిఎంఎస్ఐడిసికి చెందిన ఒక అధికారి తెలిపారు.

మెమోను వెంటనే ఉపసంహరించుకోవాలి

మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని ఇచ్చిన మెమోను వెంటనే ఉపసంహరించుకోవాలి. మా ప్రాంతంలో మెడికల్ కాలేజీ వచ్చింది ఎలాగైనా డాక్టర్లు అవుతామని ఎంతో కష్టపడి నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెమో నిరాశపరిచింది. నీట్ పరీక్షలో తమకు మంచి ర్యాంకులు వస్తే తమున్న చోటనే డాక్టర్ చదువును చదవచ్చని చాలా మంది విద్యార్థులు ఆశ పెట్టుకున్నారు.వారి ఆశలన్నీ అడియాశలవుతాయి. ఆగిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

మెమోను వెంటనే రద్దు చేయాలి

ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆపాలని ఇచ్చిన మెమోను రద్దు చేయాలి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రభుత్వ వైద్యకళాశాల వచ్చిందని ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల నిర్మిస్తే దానికి అనుబంధంగా ఆస్పత్రి కూడా నిర్మాణం జరుగుతుంది. దాని ద్వారా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందేది. వాటిని నీరుగార్చేలా ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు.

- కె.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు.

లేబర్ చట్టాలకు తూట్లు

- కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

లేబర్ చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ, కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. గురువారం కర్నూలు ఓల్డ్ సిటీలోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిఐటియు నాయకులు కెడిసిఎంఎస్ స్వామి దాసు, మండి బజార్ కమిటీ సభ్యులు శేఖర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. స్వామిదాస్ కర్నూలు నగరంలోనే కాక తాండ్రపాడులో సిపిఎం కోసం అహర్నిశలు పని చేశారన్నారు. శేఖర్ కర్నూల్ నగరంలో మండి బజార్ సిఐటియు కమిటీలో కాక సొంత గ్రామం గోకులపాడులో పార్టీ కోసం అహర్నిశలు పని చేశారన్నారు. వీళ్లిద్దరు నాయకులు కోల్పోవడం సిఐటియుకు, సిపిఎంకు తీరని లోటన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బ్రిటీష్ కాలం నుండి ఉన్న కార్మిక 44 చట్టాలను 4 కోడ్లుగా మార్చిందని, కార్మికులకు పని గంటలు, భద్రత, జీతభత్యాల విషయంలో హక్కులు లేకుండా చేసిందన్నారు. కార్మికులకు రక్షణ లేకుండా బిజెపి ప్రభుత్వం చేసిందన్నారు. లేబర్ అధికారులు ఫ్యాక్టరీల్లో, కార్ఖానాల్లో ఎలాంటి తనిఖీలు చేయకుండా యజమానులకు ఉపయోగపడేటట్లు చట్టాలను తయారు చేశారన్నారు. అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో 17 మంది కార్మికులు చనిపోవడమేనన్నారు. కార్మికుల ప్రాణాలు హరిస్తున్న చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు కె.వి సుబ్బయ్య, పార్వతయ్య, ఎస్ఎండి షరీఫ్, రాజగోపాల్, కృష్ణ, రాంబాబు, బజారి, మద్దిలేటి, సుంకన్న, శీను, నూరు, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటలో ప్రజాప్రతినిధులు అరెస్టు

ప్రజాశక్తి - ఆలూరు

ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజాప్రతినిధులే పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన ఘటన ఆలూరులో చోటుచేసుకుంది. గురువారం పట్టణంలోని దంబరు గోవిందుకు చెందిన ఇంట్లో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సిఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ సి.వెంకట నరసింహులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆలూరు జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, కురుకుంద సర్పంచ్ దేవరెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీ అయ్యాడు. అరెస్టు అయిన వారి వద్ద నుండి రూ.55,560 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సి.వెంకట నరసింహులు తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రం వ్యవహారంలో

ఐదుగురు అధికారులపై కేసు

ప్రజాశక్తి - కౌతాళం

నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం వ్యవహారంలో ఐదుగురిపై గురువారం కేసు నమోదైంది. ఎస్సై ఎస్ఎండి రిజ్వాన్ తెలిపిన వివరాల మేరకు.. పెద్దపాడుకు చెందిన నల్లగోడి శ్రీనివాసులు కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ నివాసిగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం కోసం ఆగష్టు 23న అర్జీ పెట్టుకున్నాడు. దాన్ని అధికారులు జారీ చేశారు. శ్రీనివాసులు నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందిన నల్లగోడి శ్రీనివాసులుతో పాటు ధ్రువీకరణ పత్రం జారీ చేసిన కౌతాళం తహశీల్దార్ కె.మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహశీల్దార్ వీరభద్ర గౌడ్, ఆర్ఐ రాజశేఖర్, బదినేహాల్ వీఆర్వో సూర్య నారాయణ రెడ్డిపై భారత న్యాయ సంహిత 61(2), 336(3), 318(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నల్లగోడి శ్రీనివాసులు సెకండ్ గ్రేడ్ టీచర్ కాగా ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యంకండి

- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వక్తలు - ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కే శామ్యూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. ఉపాధ్యాయులు లేనిదే ఎవరు లేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను కూడా త్వరలో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు బోధినేతర పనులను అప్పగించ కుండా ఎత్తివేయడం జరిగిందన్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయలుగా ఎంపికైన 23 మంది ఉపాధ్యాయులకు అవార్డులను అందజేసి ఘనంగా ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఏడీలు సామ్యూల్ పాల్, శ్రీనివాసులు డిసిఇబి సెక్రెటరీ నాగరాజు, డిప్యూటీ డిఈవోలు, ఎంఈఓలు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ పాటి, రవికుమార్, ఎస్‌టియు అధ్యక్షుడు గోకారి ఇతర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలును సన్మానిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి సభను జయప్రదం చేయండి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి-గూడూరు

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ దగ్గర కేకే భవన్‌లో ఈనెల 10న నిర్వహించే వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ కోరారు. గురువారం గూడూరులో ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు శేషన్న ఇంట్లో వర్ధంతి సభ కరపత్రం ఆవిష్కరించారు. గురుశేఖర్ మాట్లాడుతూ... వీరనారి చాకలి ఐలమ్మ రజక వత్తిదారుల కుటుంబంలో జన్మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారిగా నిలచిందన్నారు. 2000లో అప్పటి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా హైదరాబాదులోని బషీర్ బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ముందు వరుసలో ఉండి బుల్లెట్ గాయాలకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ నేలకొరిగారని తెలిపారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వర్ధంతి సభలో రజక వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు మండల కార్యదర్శి సి.రమేష్, పట్టణ కార్యదర్శి సి.అశోక్, మండల గౌరవాధ్యక్షుడు లక్ష్మన్న, పట్టణ నాయకులు సి.చిన్న లక్ష్మన్న, సి.రామదాసు, సి.అంజి, సి.సాయి, సి.చిన్న సోమన్న, సి.రాముడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. గురువారం నగరంలోని బండిమెట్ట వీధిలో వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్రమాదకర రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలను కాకుండా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యావంతులు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు.

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలతో పాటు వర్సిటీలో కూడా ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ యూనివర్సిటీలో సర్వేపల్లి చిత్రపటానికి రిజిస్ట్రార్ పి.వెంకటేశ్వర్లు, సిడిసి డీన్ సివి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో రాధాకృష్ణ చిత్రపటానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ పిఎస్.షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జహనరా పాల్గొన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి పాల్గొని రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. నగరంలోని స్థానిక డాక్టర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

మైపర్‌లో...

కర్నూలు నగరంలోని ఎ.క్యాంపులో గల మైపర్ ఫార్మసీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్ రెడ్డి వైస్, ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ రాజ్ కుమార్, రఘువీర్ పాల్గొన్నారు.

మైపర్ ఫార్మసీ కళాశాలలో మాట్లాడుతున్న సతీష్

రవీంద్రలో...

రవీంద్ర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, అకాడమిక్ అడ్వయిజర్ డాక్టర్ మమతా మోహన్ పాల్గొన్నారు. పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జి.రాజశేఖర్, నాగమణి, సురేఖను సన్మానించారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

కర్నూలు కార్పొరేషన్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాధాకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి కె.ప్రకాష్ మాట్లాడారు. ఉప గ్రంథ పాలకురాలు పెద్దక్క, సహాయ గ్రంథాలయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి, ఉప గ్రంథాలయ అధికారులు బాష, పద్మావతమ్మ, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఈ.తాండ్రపాడులో పర్యటించిన ఎంపీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలంలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కలిపిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఆసుపత్రిలో ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పలు సమస్యలను వైద్యులు ఎంపి దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఊరి లోపల ఉండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మెయిన్ రోడ్డు నందు ఆసుపత్రికి సంబంధించిన సైన్ బోర్డు పెద్దదిగా ఏర్పాటు చేయాలని, మెయిన్ రోడ్డు నుంచి ఆసుపత్రికి వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆసుపత్రి ఆవరణంలో డూమ్ లైట్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఆసుపత్రిలో రోగులకు వారి సహాయకులకు షెడ్డు తోపాటు ప్రహరి గోడను నిర్మించాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఉద్యోగుల హాజరు బుక్కును పరిశీలించి, గ్రామ అభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామస్థులతో సమావేశమైన ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- జిల్లా లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకట శేషాద్రి తెలిపారు. గురువారం కర్నూలు నగరంలో గురువారం ఆటో కార్మికుల అవగాహన సదస్సు ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.మెహమూద్ అధ్యక్షతన అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. జిల్లా లోక్ అదాలత్ జడ్జి లీల వెంకట శేషాద్రి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ మనోహర్, ట్రాఫిక్ సిఐ మనసురుద్దీన్, కంటి వైద్య నిపుణులు పి.సుధాకర్ రావు, గుండె వైద్య నిపుణులు కే.అరుణ, ఏఎం వి కిషోర్, ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్. లక్ష్మణ్ సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం. విజయ రామాంజనేయులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రమాద రహిత జిల్లాగా మార్చాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉందని దానికి మీరందరూ సహకరించి కృషి చేయాలని అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ వాహనం నడపాలంటే లైసెన్స్ కలిగి ఉండాలని అలా లేనిచో ఇప్పుడున్న చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. వచ్చిన ప్రయాణికులతో ప్రజలతో మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయరాదని, మైనర్లకు ఆటోలు అప్పగించరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఆటో యూనియన్ నగర అధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షులు దూదెకొండ కుమార్, బడే భాష, కిట్టు పాల్గొన్నారు.

గట్టావు వంకపై తెగిన రోడ్డు

- పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని బ్రహ్మణదొడ్డి – పోలకల్ మధ్యలో ఉన్న గట్టావు వంకపై ఇటీవల వర్షాలకు రోడ్డు తెగిపోయింది.కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం మండలంలోని నాయకుల, కార్యకర్తల సమక్షంలో పరిశీలన చేశారు. అలాగే పోలకల్‌లో కోళ్ల ఫారం పక్కన పొలాలకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు ఎమ్మెల్యేతో తెలిపారు. బ్రాహ్మణదొడ్డి రైతులు, పోలకల్ నుండి ప్రయాణికులు తెగిపోయిన రోడ్డుతో రాకపోకలు నిలిచాయని ఎమ్మెల్యేతో వాపోయారు. ఎమ్మెల్యే స్పందించి తాత్కాలిక పనులను తక్షణమే చేపట్టాలని అధికారులకు సూచించారు.

'15లోపు పంట నమోదు చేసుకోవాలి'

పత్తికొండ : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను ఈనెల 15లోపు రైతులు నమోదు చేసుకోవాలని ఎఒ వెంకట్ రాముడు తెలిపారు. గురువారం మండలంలోని చిన్న హుల్తి, జూటూరు, దేవనబండ, నలకదొడ్డి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఎఒ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడారు. ఈ పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని రైతు భరోసా సిబ్బందిని ఆదేశించారు. పంట నమోదు చేసిన రైతులందరికీ గ్రామ వ్యవసాయ అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్లకు ఈకేవైసీ తప్పనిసరి చేసి విఆర్ఒ లాగిన్‌లో కూడా ఈనెల 15లోపు నమోదు చేసుకున్న రైతులందరికీ ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉమలత, వాణి, విఎఎ సూర్య ప్రకాష్ రెడ్డి, ఎంపిఇఒలు మహబూబ్, రాధాబాయి పాల్గొన్నారు.

హిటాచిపై రూ.లక్ష జరిమానా

కర్నూలు క్రైమ్ : అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న హిటాచి వాహనంపై రూ.లక్ష జరిమానా విధించినట్లు కర్నూలు మైనింగ్ శాఖ డిడి టి.రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. గత నెల 10న కర్నూలు మండలంలోని జగన్నాథ గట్టుపై ఉన్న గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వడ్డే లక్ష్మీదేవికి చెందిన హిటాచి వాహనాన్ని పోలీసుల సహకారంతో మైనింగ్ శాఖ వారు సీజ్ చేశారని తెలిపారు. గురువారం రూ.లక్ష జరిమానా విధించి వాహనాన్ని రిలీజ్ చేశామన్నారు. ప్యాపిలి అక్రమంగా వైట్ సీల్ తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని రూ.25 వేలు జరిమానా విధించామన్నారు. విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని, ప్లాస్టిక్ వాడటం వల్ల వాతావరణంలో అనేక మార్పులతో జీవుల మనుగడకు ముప్పు వాటిల్లుతుండడం వల్ల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని మాజీ మంత్రి, మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ ప్రజలను కోరారు. గురువారం కర్నూలు నగరంలోని పాత బస్టాండ్‌లోని శ్రీవాసవి ఏజెన్సీ అధినేత శేషు ఫణి శెట్టి ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాలను టిజి.వెంకటేష్ ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ నిర్మూలనకు భారత ప్రధాని బృహత్తర కార్యక్రమాలు చేపట్టారని, ప్లాస్టిక్ రహిత బ్యాగులను వాడాలని పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే ప్లాస్టిక్‌ను సమాజం నుంచి పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కంకణ భక్తులు కావాలని కోరారు.

వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఎస్వీ.మోహన్ రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

వైసిపి జిల్లా అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డిని నియమించారు. గురువారం వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు.

జగన్ నమ్మకాన్ని వమ్ము చేయను

- మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్‌రెడ్డి తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమించిన తర్వాత కర్నూలు నగరంలో ఎస్వీ.మోహన్ రెడ్డి స్వగృహానికి 33 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ నాయకులు, మహిళా నాయకులు, ఎస్వీ యూత్ గురువారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎస్వీ.మోహన్ రెడ్డిని పూలమాలలతో సన్మానించారు. ఎస్వీ.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో వైసిపి బలోపేతానికి తామందరం ఆయన వెంట నడుస్తామని తెలిపారు.

వరద బాధితులకు బీవీ ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజయవాడ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి వరద నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరద బాధితులకు 'నేనున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తూ ఉదయం, రాత్రి అని తేడా లేకుండా వారికి ఎన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ డ్రోన్ ద్వారా భోజనాలు కల్పిస్తూ ఇతర సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికై మూడు నెలలు అవుతోందని, వరద బాధితులకు తన వంతు రూ.3 నెల జీతం రూ.5 లక్షల చెక్కును అందిస్తున్నట్లు చెప్పారు. టిడిపి నందవరం మండల నాయకులు ఈరన్న గౌడ్ కూడా రూ.10 వేల చెక్కును అందించినట్లు తెలిపారు. టౌన్ బ్యాంకులో అవినీతి జరిగినట్లు బహిరంగ ప్రకటన చేస్తున్నారని ప్రశ్నించగా... దానిపై కమిటీ నియామకం తర్వాత విచారణ చేపడతామన్నారు. అలాగే ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిఓ విడుదల చేసిందని, ఈ ప్రాంతం వారు నష్టపోతారని ప్రశ్నించగా... తమకు తెలియదని, ముఖ్యమంత్రి చంద్రబాబును సంప్రదించి నిర్ణయాన్ని కొనసాగించేటట్లు చూస్తామని తెలిపారు.

టౌన్ బ్యాంకు నూతన కమిటీ ప్రతిపాదన

ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యుల కమిటీ ఎన్నికకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత శాఖ మంత్రికి ప్రతిపాదన చేసినట్లు ఎమ్మెల్యే బీవీ తెలిపారు. నూతన అధ్యక్షులుగా ఒరుకుంటయ్య శెట్టి, ఉపాధ్యక్షులుగా బండ నరసప్ప, సభ్యులుగా మేకల్ మహబూబ్ బాషా, ఉప్పర రవికుమార్, దొమ భీమేష్, వాల్మీకి రాజు, వెంకటేశ్వర్ రెడ్డి, కదిరికాల శాలెం, తోట నరసింహులు, ఆడిమి నవీన్ కుమార్, మాచాని బాల గంగాధర్ పేర్లను ప్రతిపాదించినట్లు చెప్పారు.

హాలహర్వి: మండలంలోని పలు చౌక దుకాణం డీలర్లు టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు రూ.1.60 లక్షలు విరాళంగా టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు అందజేశారు. కన్వీనర్ సుధాకర్, విజయ భాస్కర్ గౌడ్, ఆశోక్ యాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, బిజెపి మండల కన్వీనర్ బసవరాజు పాల్గొన్నారు. **దేవనకొండలో** టిడిపి, జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణలో సాయి ఫెస్టిసైడ్స్ ఫర్టిలైజర్స్ (ట్రేడర్స్) నిర్వాహకులు వేణుగోపాలరావు రూ.50 వేలు తన వంతు ఆర్థిక సహాయం అందించారు. టిడిపి నాయకులు బడి గింజల రంగస్వ, ఆకుల వీరేష్, మలకన్న, మాల బండయ్య, రాజా సాబ్, సుభాన్, జనసేన నాయకులు ఉచ్చీరప్ప, వడ్డే గోవిందు, మక్బుల్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

- మండల అధికారులు

ఫోటో : పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న మండల అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 13 పంచాయతీల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ తప్పనిసరిగా నిర్వహించాలని పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారులు చేసే ప్రతి కార్యక్రమం కూడా పిఆర్ వన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. భారీ వర్షాల వల్ల ఏర్పడే నష్టాలను కూడా వివరించాలన్నారు. పరిసరాలపై శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి పైపులైన్లు ఎక్కడ పోయినా వెంటనే మరమ్మతులు చేయించి పరిష్కరించుకోవాలని తెలిపారు. వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకొని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకుంటే అంటువ్యాధులను నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు విడిచే ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, జయరాం నాయక్, సుధీర్, సురేంద్ర, నారాయణ స్వామి, నరసింహులు, రామాంజనేయులు, ప్రమీల పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి

12 తలాల బంగారు అపహరణ

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని కోయనగర్‌కు చెందిన బట్టల వ్యాపారి ఈరమ్మ ఎన్‌జిఒస్ కాలనీలో గోవిందు భార్య మాధవికి మాయమాటలు చెప్పి 12 తులాల బంగారు నగలు, 40 తులాల వెండి పట్టీలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. గురువారం గోవిందు ఊరెళ్లుదామని భార్యకు చెప్పి నగలు ధరించుకోమని కోరగా నగలు లేవని ఈరమ్మ తీసుకెళ్లిందని చెప్పడంతో కుటింబీకులు, స్థానికులు నివ్వెరపోయారు. కోయనగర్‌కు ఈరమ్మ ఇంటికి వెళ్లి అడగగా తనకు తెలియదని చెప్పడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారిస్తున్నట్లు తెలిపారు. 12 తులాల బంగారు నగలు ఓ ప్రయివేట్ బ్యాంకులో కుదువ పెట్టినట్లు తెలిసింది. గతంలో ఈరమ్మ ఆలూరులో కొంతమందికి రుణాలు ఇప్పిస్తానని మోసం చేసి డబ్బులు దండుకున్నట్లు బాధితులు తెలుపుతున్నారు.

కరువు, తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి - పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

2023 ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తెర్నేకల్ సిపిఎం కార్యాలయ ఆవరణలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం రైతులందరికీ పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. 12 ఏళ్ల నుంచి ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు లేక రైతులు అప్పుల్లో కోరుకుపోయి ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. రైతుల ఆత్మహత్యల నివారణ చర్యల్లో భాగంగా రైతులకు బ్యాంకుల్లో రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం బిజెపి ఒత్తిడితో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టే దిశగా అడుగులు వేసిందని, అప్పుడు టిడిపి దానిని వ్యతిరేకించిందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లను పెట్టే జిఒ 22ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. జిల్లాలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోయిందని, దాని నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. కౌతాళం మండలం మేలిగనూరు నుంచి తుంగభద్ర వరకు కాలువ నిర్మాణం చేపట్టాలని, హంద్రీనీవా ప్రధాన కాలువ గుండా పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేసి రైతులందరికీ సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9, 10, 17, 18న నిర్వహించే వినతుల అందజేత, ఆందోళన, ధర్నాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు హనుమంతు, సి.హనుమంతు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సూరి, మహబూబ్ బాషా, బడేసాబ్, పరమేష్, నాయకులు శ్రీరాములు, బజారి, గాజుల శ్రీనివాసులు, పరాక్రమ రాములు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

తనపై అసత్య, తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న హెచ్చరించారు. గురువారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో మండలాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేన పార్టీలో ముగ్గురు, నలుగురు గ్రూపులుగా విడగొట్టి పార్టీని బలహీన పరచడమే కాక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తనను ఇలాగే విమర్శిస్తే, దుష్ప్రచారం చేస్తే చట్ట ప్రకారం వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. 'తెలియక విమర్శించిన వారు మన వారే కదా' అని మౌనం వహిస్తున్నానని, దానిని చేతకాని తనంగా భావించవద్దని సూచించారు. నాయకులు అందరినీ కలుపుకొని కార్యక్రమాలు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఫోన్ చేసినా రావడం లేదని, దీనికి తాను ఎలా బాధ్యుని అవతానని ప్రశ్నించారు. ఈనెల 2న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను కోసిగిలో ఘనంగా నిర్వహించామని తెలిపారు. నాలుగు మండలాల టిడిపి నాయకులు, రాష్ట్ర నాయకులు, జనసేన, బిజెపి నాయకులు హాజరయ్యారని పేర్కొన్నారు. నాయకులు వీరారెడ్డి, రజాప్, మాదేవా, బజారి, సుమిత్ర, మంజునాథ్‌లు కూడా తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. నాయకులు బీవీ.రవిచంద్ర, వీరప్ప, మౌనేష్, వెంకటేష్, సదాశివ, కరీం స్వామి, సుభాన్, వన్నూరి మరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా విద్యావంతులు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం తెలిపారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ జీరో రోడ్ కింగ్ ప్యాలెస్ సమీపంలో ఏర్పాటు చేసిన హోటల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని బల్లేకల్ గ్రామానికి చెందిన అనిల్, రవి వర్మ పీజీ వరకు చదువుకున్నారని తెలిపారు. ఉద్యోగ వేటలో ఉంటూనే ఆర్థిక ఇబ్బందులు రాకుండా స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపడం అభినందించదగ్గ విషయమన్నారు. స్వయంకృషితో ఎదగాలని టీ బ్రేక్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకొని యూత్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళా సంఘం నాయకులు సుగుణమ్మ, షేక్షావలీ ఉన్నారు.

హోటల్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

పంటల దిగుబడిలో సూచనలు పాటించాలి : శాస్త్రవేత్త రాఘవేంద్ర

ప్రజాశక్తి - హాలహర్వి

ఎడతెరపి లేకుండా కరుస్తున్న వర్షాల వల్ల పంటలకు ఆశిస్తున్న తెగులు, చీడపీడల నివారణకు అధికారుల సూచనలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర తెలిపారు. గురువారం హాలహర్విలో కంది, పత్తి, మిరప, కొర్ర, టమోటా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి పంట నీటి ముంపునకు గురైనప్పుడు పిందే, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం, పడిపోవడం జరుగుతుందని తెలిపారు. పొటాషియం నైట్రేట్ యూరియాలో కలిపి వారం రోజులకు మార్చి మార్చి పిచికారి చేయాలన్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా పొటాష్ ఎరువుగా వేయాలన్నారు. మిరప పంటలో వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల తెగులు వచ్చే అవకాశం ఉందని, మందులు పిచికారి చేయాలని తెలిపారు. ఎఒ శివశంకర్, ఆర్‌బికె ఇన్‌ఛార్జీ ఇంద్రజ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా 600 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, కార్యదర్శి సైపుల్లా మాట్లాడారు. పట్టణంలోని అభయ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రజలకు మట్టి విగ్రహాలను అందజేశామన్నారు. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కార్యాలయంలో కలిసి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఆదోని డీఎస్పీ సోమన్నను కలిసి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పట్టణంలో 600 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతోనే పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు, మొక్కల నాటే కార్యక్రమం, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు లాంటి ఎన్నో కార్యక్రమాలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు చెప్పారు. వినాయక చవితి పండగ సందర్భంగా మట్టి వినాయకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ద్వారా అనేక అనర్థాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. మట్టి విగ్రహాలతో కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. వినాయక విగ్రహాల పంపిణీ ప్రాజెక్టు ఇన్‌ఛార్జీలు రఘునాథ్ రెడ్డి, ఇతేశ్, రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, భరత్ షా, ప్రశాంత్ గాంధీ, విట్టా మురళీధర్, శ్రీధర్ రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, పద్మనాభయ్య శెట్టి, వీరేష్ స్వామి, సోమశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, విట్టా రాజేష్, షణ్ముఖ, శివరామ్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు విగ్రహాన్ని అందజేస్తున్న సభ్యులు

వ్యవసాయ మార్కెట్‌లో చోరీ

- షాపు షట్టర్ పగులగొట్టి లోపలికి ప్రవేశం

- రూ.30 వేలు అపహరణ

ఫోటో: పగులగొట్టిన షాపు షట్టర్

ఫోటో: దుకాణంలో పగులగొట్టిన బీరువా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వ్యవసాయ మార్కెట్‌లో షాపు నెంబర్ ఎస్-42లో ట్రేడర్ వ్యాపారం చేస్తున్న ధాన్యలక్ష్మి ట్రేడింగ్ కంపెనీ యజమాని శ్రీనివాసులు బుధవారం యథావిధిగా వ్యాపారం ముగించుకొని షాపున మూసి తాళం వేసి వెళ్లారు. గురువారం ఉదయం షాపునకు వచ్చి చూసి జరిగిన సంఘటనను మార్కెట్ కార్యదర్శికి వివరించారు. షాపులోని బీరువాలో ఉంచిన రూ.30 వేల నగదును దోచికెళ్లినట్లు శ్రీనివాసులు మీడియాకు తెలిపారు. 5 రోజుల క్రితం అదే షాపు పక్కన ఓ వ్యాపారికి చెందిన 3 బస్తాల వేరుశనగ మాయమైంది. దీనిపై కూడా కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇలాగే కొన్ని సంఘటనలు జరిగాయని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పని చేయడం లేదు. విచిత్రం ఏమిటంటే చోరీ జరిగిన షాపు ముందు సిసి కెమెరా ఉంది. అది పని చేస్తుందో లేదో తెలియదు. మార్కెట్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వ్యాపారులు, రైతులు, సిబ్బంది పేర్కొంటున్నారు. మార్కెట్ కమిటీలో ఇలాంటి సంఘటనలు జరగకుండా నిఘాను పటిష్ట పరిచి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

సైబర్ క్రైం, కాల్ మనీ, రాజకీయ కక్షలపై దృష్టి

- సిఐ శ్రీనివాస్ నాయక్

ఫొటో: సచివాలయం మహిళ పోలీసులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్ నాయక్

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగే సైబర్ నేరాలు, మహిళలపై లైంగిక దాడులు, కాల్ మనీ, రాజకీయ కక్షలపై నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ సి.వెంకటనరసింహులు సూచించారు. గురువారం ఆలూరు పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రాజకీయ కక్షలతో గొడవలు సృష్టిస్తారని తెలిపారు. మహిళా పోలీసులు పలువురిపై నిఘా ఉంచాలని చెప్పారు.

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం

రైట్‌అప్: అవ్వ బ్యాంకు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గతవారం రోజులుగా కురుస్తున్న కొండపోత వర్షాల వల్ల వరదలు విలయతాండవం చేస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు, పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇక ఎపిలోని బెజవాడను, వరద నీరు ముంచెత్తింది. శ్రీమహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆదోని చైర్మన్ రాయచోటి రామయ్య బ్యాంకు తరఫున వరద బాధితుల సహాయం నిమిత్తం గురువారం రూ.5 లక్షల విరాళం ఎపి సిఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్‌టిజిఎస్ ద్వారా నిధులను బదిలీ చేసినట్లు బ్యాంకు సిఇఒ గట్టు మురళీ తెలిపారు. అలాగే బ్యాంకు సిబ్బంది కూడా ఒక రోజు జీతం రూ.40,378ను విరాళంగా ప్రకటించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు పి.వరదరాజులు మాట్లాడారు. సమాజంలో గురువు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. రాధాకృష్ణ విశిష్ట సేవల గురించి కొనియాడారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న ఆధ్వర్యంలో రాధాకృష్ణ జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **నందవరం** కస్తూరిబా గాంధీ స్కూల్, లిటిల్ ఫ్లవర్ జీనియస్ పబ్లిక్ స్కూల్, సరస్వతి విద్యాపీఠంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. **కౌతాళంలోని** ప్రతిభ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, యాజమాన్యం, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ మాట్లాడుతూ... ప్రతిభ హైస్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పాఠశాల ఉపాధ్యాయులు భారతి, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్‌కు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు భీమేష్, రాజు, జయలక్ష్మి, ఉపాధ్యాయులు శిరీష, ముంతాజ్, ఈరన్న, పరమేష్ పాల్గొన్నారు. **ఆస్పరిలోని** విజేత స్కూల్‌లో కరస్పాండెంట్ మల్లేష్, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, నారాయణ ప్రైమ్ స్కూల్‌లో కరస్పాండెంట్ నరేష్ ఆచారి, జడ్‌పిహెచ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శంకరబండ ఎంపిపి పాఠశాలలో విశ్రాంత గణిత ప్రధానోపాధ్యాయులు వెంకట రాముడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా చీరలు ధరించి కనువిందు చేశారు. ఎంఆర్‌సి భవనంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు రామ్మోహన్‌ను ఎంఇఒ రాఘన్న శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఆయన కూడా ఎంఇఒ-2 రాఘన్నకు ఉపాధ్యాయులు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. సిబ్బంది ప్రభాకర్, లలిత, సిఆర్‌పిలు నరసన్న గౌడు, బంగారప్ప, భీమేష్, శివ ప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఎంపిపి స్కూల్ ఆవరణలో గురుపూజోత్సవం సర్పంచి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దే గురువులకు సర్పంచి అరుణ్ కుమార్ తన సొంత ఖర్చులతో సన్మానించడం అభినందనీయమని ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగరాణి తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు విరుపాక్షి రెడ్డి, పౌల్, గ్రామంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది ఉపాధ్యాయులను పూలమాల, శాలువా, మెమెంటోతో సన్మానించారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి, వైసిపి జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, జన విజ్ఞాన ప్రతినిధి శేషాద్రి రెడ్డి, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజిఎస్ ఇంజినీర్ మధు, ఉప సర్పంచి బెల్ ఈరన్న, మాజీ ఎంపిటిసిలు చాప ఈరన్న, రాఘవేంద్ర, విద్యా కమిటీ ఛైర్మన్ మంచాల రాముడు, గ్రామ పెద్దలు ఏసేపు నాగన్న, అడివన్న, లింగన్న పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దహరివాణం కన్నడ ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ముకప్ప, ఉపాధ్యాయులు నిర్మల, హులుగప్ప, ముత్తన్న, అన్నపూర్ణ, అశ్వతప్ప, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఉపాధ్యాయులకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. సిపర్స్ అసోసియేషన్ నాయకులు కల్లుబావిరాజు, మద్దిలేటి పాల్గొన్నారు. అలాగే ఆదోనిలోని నేషనల్ హైస్కూలులో అధినేత జి.గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించారు. డైరెక్టర్ విజయకుమార్, సత్యశ్రీ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని దీక్ష జూనియర్, రావూస్ డిగ్రీ కళాశాలలో దీక్ష జూనియర్, రావూస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణ చిత్రపటానికి తిరుమల రెడ్డి, రావూస్ కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, దీక్ష జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటిలు పూలమాల వేసి నివాళులర్పించారు. రావూస్ కళాశాల అధ్యాపకులు గోరంట్ల, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నూర్ బాష, విజయ్ కుమార్, పాల్ రాజ్, వీరేష్, నందిని, అన్నపూర్ణ, విజయరాజ్, మనో వెంకట్, సంధ్య, శ్రుతి ప్రియా, సంపత్, ధనుంజయ, గోవిందు, దీక్ష జూనియర్ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ పవన్ కుమార్, శివకుమార్, రామాంజనేయులు, సురేష్, శివ, పి.శివకుమార్, గౌస్, కృష్ణ, వి.శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, కె.నాగేంద్రరావు, గోపాలకృష్ణ, నూరుల్లా, అహ్మద్ అలీ, లలిత, రమాదేవి, భాగ్యలక్ష్మి, విమల, బేగం, సింధు, రేణుక, పాల్గొన్నారు.

చిప్పగిరిలో రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కౌతాళంలో...

నందవరంలో...



ఆదోని నేషనల్ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

ఆస్పరి విజేత స్కూల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ మల్లేష్

ఆదోని మండలం పెద్దహరివాణంలో...

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఉపాధ్యాయ వృత్తి గొప్పది : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అన్ని వృత్తుల్లోకి ఉపాధ్యాయ వృత్తి గొప్పదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం వీవర్స్ కాలనీలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శమన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఎంఇఒ-2 మధుసూదన్ రాజు, ఉపాధ్యాయులు నర్సప్ప, సుధాకర్, నరసింహులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా నరసింహులు

ప్రజాశక్తి - ఆలూరు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నరసింహులును సన్మానించారు. గురువారం కర్నూలు నగరంలో కలెక్టర్ రంజిత్ బాష, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి, డిఇఒ, గురుకుల కో ఆర్డినేటర్ శ్రీదేవి శాలువా కప్పి మెమెంటో అందజేసి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురుకులంలో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ విద్యార్థులతో మమేకమై వారి అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. అలాగే గురుకుల పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారం అందించారని చెప్పారు. పది మందికి విద్యనందించి విద్యార్థులను ఉత్తమ మార్గంలో నడిపించేందుకు, తోటి ఉపాధ్యాయులుతో స్నేహభావం కలిగి పాఠశాల, విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో కృషి చేశారని తెలిపారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎంపీ

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మండలంలోని జాలవాడి ఎంపిపి స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న బి.విక్టోరియమ్మ, హనుమాపురం జడ్‌పి హైస్కూల్‌లో గణితోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కె.విజయకుమారికి గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కర్నూలు కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్ బాష చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విక్టోరియమ్మను, కె.విజయ కుమారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు అందజేస్తున్న అధికారులు